

## జ్యోతిబా ఫూలె - మానవ హక్కుల దృక్పథం సెమినార్

24 జూలై ఆదివారం

సాయంత్రం 4.00 గంటలకు

**ఠాగూర్ లైబ్రరీ**

బందర్ రోడ్డు, విజయవాడ

**అధ్యక్షత:**

ఎం.నాగార్జున

**వక్తలు:**

డా॥ బుర్రా రాములు

ప్రొ॥ ఎన్.అంజయ్య

డా॥ కె.బాలగోపాల్

# ఫూలే బాటలో ముందుకు పోదామా...

హక్కుల ఆకాంక్ష జీవితం నుండి పుడుతుంది. హక్కుల భావన దాని పర్యవసానం. ఏ పేరు పెట్టుకున్నా, ఏ పేరూ పెట్టుకోకున్నా, అది అనాది కాకపోయినా చాలా ప్రాచీనమయినది.

హక్కుల సిద్ధాంతం సంగతి వేరే. దాని కోసం తత్వవేత్తల రచనలలో వెతకాలి. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే హక్కుల తత్వవేత్తలెవ్వరూ వట్టి తత్వవేత్తలు కారు. హక్కుల సాధనకు సంబంధించిన ఆచరణతో సజీవ సంబంధం గల వారే హక్కుల తత్వవేత్తలంతా.

మన దేశానికి సంబంధించిన ప్రముఖ హక్కుల తత్వవేత్తలలో జ్యోతిబా ఫూలె ఒకరు. భారతదేశంలో హక్కుల భావన, దానికి సంబంధించిన తత్వ చింతన బ్రాహ్మణ ధర్మాన్నీ బ్రాహ్మణీయ సమాజాన్నీ వ్యతిరేకించిన సామాజిక ఆచరణలోనే పుట్టింది. అందులో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. ఎందుకంటే హక్కుల కాంక్షకు సమానత్వ భావన మూలం. సమానత్వ భావనకూ బ్రాహ్మణీకానికీ చుక్కె

దురు. అది ఆత్మల సమానత్వాన్నే తప్ప శరీరంతో కూడిన మానవుల సమానత్వాన్ని ఏ రూపంలోనూ ఏ కోశానా ఒల్లదు.

అయితే బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల నుండి, లేదా సామాజిక ఆచరణ నుండి పుట్టిన తత్వవేత్తల ఆలోచనలన్నీ అన్ని విషయాలలోనూ ఒకే రకంగా లేవు. ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. హక్కుల కోణం నుండి చూసినప్పుడు బహుశా అందరి కంటే విస్తృత ఆలోచనా పరిధి ఉన్న తత్వవేత్త జ్యోతిబా ఫూలె.

భారతదేశంలో ఆధునిక కాలంలో హక్కుల గురించి ఆలోచించిన తత్వవేత్తలందరూ పాశ్చాత్య ఉదారవాద సంప్రదాయాన్ని రెండు చేతులా ఆహ్వానించారు. అది 'పాశ్చాత్యం' కాబట్టి మనకు అక్కరలేదనుకోలేదు. బ్రాహ్మణీకపు నిచ్చెన మెట్ల విలువలను వ్యతిరేకించ డానికి కావలసిన తాత్విక సంపద అందులో ఉందని గుర్తించి ఆహ్వానించారు. అయితే దానికి హైందవ సమాజంలో – లేదా దానికి వ్యతిరేకంగా – జరిగిన పోరాటాలు, తిరుగు బాట్లు, నిరసనల చరిత్రను కూడ జోడించి మనకు అవసరమైన 'హక్కుల' భావనను రూపొం దించే కృషి చేశారు. జ్యోతిబా ఫూలె ఆలోచనలకు థామస్ పెయిన్ స్ఫూర్తి ఎంత ఉందో బలిచక్రవర్తి స్ఫూర్తీ అంత వుంది. అంబేద్కర్ బుద్ధుడిని ఎంతగా చదివాడో పాశ్చాత్య లిబ రల్ తాత్విక సంప్రదాయాన్నీ అంతగా చదివాడు.

విస్తృతి గురించి చెప్పుకోవాలంటే, దళిత బహుజనుల హక్కులకూ స్త్రీల హక్కులకూ ఒక కృత్రిమ వైరుధ్యం తరచుగా తలెత్తుతున్న ఈ రోజులలో ఫూలె ఆలోచన, ఆచరణ అం దరికీ ఆదర్శంగా నిలవగలదు. ఆయన స్త్రీల స్వేచ్ఛనూ శూద్రకులాల స్వేచ్ఛనూ వేరు వేరు విషయాలుగా చూడలేదు. ఇవ్వాళ ఆయనను తమ తత్వవేత్తగా ప్రకటించుకుంటూ స్త్రీల రాజకీయ సమానత్వం దళిత బహుజనులకు వ్యతిరేకం అనే నాయకులుండడం మన దురదృష్టం.

భారతదేశంలోని హక్కుల ఉద్యమం తనకంటూ ఒక హక్కుల దృక్పథాన్ని ఇప్పటికింకా సమగ్రంగా రూపొందించుకోలేదు. ఆ కృషి జరిగిన నాడు జ్యోతిబా ఫూలె ఆలోచనలకు అందులో ప్రముఖ స్థానం ఉంటుంది. అసలు ఫూలె ఆలోచనలతోనే మొదలుపెట్టి ఇతర ఆలోచనా స్రవంతులను మిళితం చేసుకుంటూ పోవడమే సమగ్రమైన హక్కుల దృక్పథానికి బాటవేయగలదని ప్రకటించవచ్చునేమో చర్చించుకుందాం రండి.

**18 జూలై, 2005** — మానవహక్కుల వేదిక

కృష్ణా జిల్లా కమిటీ — Human Rights Forum (HRF)